ఆంధ్రజ్యోతి ప్రవాస

# డల్లాస్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**గాంధీ మెమోరియల్ దగ్గర నిర్వహించిన ఎంజీఎంఎన్‌టీ**

**డల్లాస్, 20-06-2018:** మహాత్మా గాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (**ఎంజీఎంఎన్‌టీ**) ఆధ్వర్యంలో డల్లాస్ (ఇర్వింగ్) లో జూన్ 17న నాలుగవ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 300 మందికి పైగా యువతీ, యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాన్సుల్ అశోక్ కుమార్, ఇర్వింగ్ సిటీ మేయర్ ప్రోటెం ఆలన్ మీఘర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎం.జి.ఎం.ఎన్.టి కార్యదర్శి రావు కల్వల అందరికీ స్వాగతం పలుకుతూ ఇలా గాంధీ మెమోరియల్ దగ్గర యోగ దినోత్సవం జరుపుకోవడం ఇది నాలుగవసారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన భారత కాన్సులేట్ అధికారులకు, ఇర్వింగ్ సిటీ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎం.జి.ఎం.ఎన్.టి బోర్డు ఆఫ్ డైరెక్టర్ షబ్నమ్ మోడ్గిల్ కార్యవర్గ సభ్యులను అందరికీ పరిచయం చేశారు.

## ఫొటోల కోసం క్లిక్ చేయండి

**ఎంజీఎంఎన్‌టీ** ఛైర్మన్ డా. ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ 5,000 సంవత్సరాల క్రితం రిషికేష్ యోగాకు జన్మస్థలం అయ్యిందని, 2014లో ఐక్యరాజసమితి జూన్ 21 ని యోగా దినోత్సవంగా ప్రకటించడంతో ఆ రోజున ప్రపంచవ్యాప్తంగా 175 దేశాలు యోగా దినోత్సవాన్ని పాటిస్తున్నాయని తెలిపారు. గాంధీ మహాత్ముడు కూడా యోగాకు, ధ్యానానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారని, ఈ రోజు అదే గాంధీ స్మారక స్థలంలో యోగా దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

కాన్సుల్ అశోక్ కుమార్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ మెమోరియల్ దగ్గర యోగా దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందని, భారత ప్రధాని నరేంద్ర మోడీ కృషితో ఐక్యరాజ్యసమితి జూన్ 21ను యోగా దినోత్సవంగా ప్రకటించడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ఇర్వింగ్ సిటీ మేయర్ ప్రోటెం ఆలన్ మీఘర్ మాట్లాడుతూ ఈ విశాలమైన థామస్ జెఫెర్సన్ పార్కులో మహాత్మా గాంధీ మెమోరియల్‌ను ఏర్పాటు చేసిన సభ్యులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా యోగాలో పాల్గొనడం చూసి సంతోషిస్తున్నాని, సిటీ తరపున ఏ సహాయం చేయడానికైనా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. **ఎంజీఎంఎన్‌టీ** కో-చైర్మన్ కమల్ కౌషల్ యోగా ప్రాముఖ్యాన్ని వివరించి, యోగా శిక్షకుడు విజయ్, వారి బృందంతో యోగా శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించవలసిందిగా ఆహ్వానించారు. దాదాపు గంటకు పైగా జరిగిన ఈ యోగా శిక్షణలో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఇదే వేదిక పై ప్రతిష్ఠాత్మకమైన 'స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీలలో' ప్రథమ స్థానం సాధించిన కార్తీక్ నెమ్మాని, ద్వితీయ స్థానం పొందిన నైన మోడీ, తృతీయ స్థానం పొందిన అభిజయ్ కొడాలిలను, వారి తల్లిదండ్రులను, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన 'జియోస్పెల్ అకాడమీ' నిర్వాహకులు విజయ్ రెడ్డి, గీత మంకులను ఎం.జి.ఎం.ఎన్.టి ఛైర్మన్ డా. ప్రసాద్ తోటకూర, ఇతర బోర్డు సభ్యులతో కలసి ఘనంగా సన్మానించారు.

**ఎంజీఎంఎన్‌టీ** కోశాధికారి బి.ఎన్.రావు ఈ కార్యక్రమ విజయానికి సహకరించిన అధికారులకు, కార్యకర్తలకు, మీడియా వారికి, బాంబే ఫోటోగ్రఫీ వారికి, మ్యూజిక్ మస్తీ వారికి, హర్యానా సంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. యోగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ యోగ్యతా పత్రాలు అందజేశారు.